

గంగిరెద్దుకు పూజలు చేస్తూ..

సంక్రాంతి సంబరం

- జిల్లాకు ప్రత్యేక శోభ
- వెల్లివిరిసిన సంప్రదాయాలు
- గోవులకు ప్రత్యేక పూజలు
- కనుమ రోజున జోరుగా మద్యం, మాంసం విక్రయాలు

సాలూరు రూరల్/గరుగుబిల్లి/కురుపాం రూరల్: జిల్లాలో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. పల్లెలు, పట్టణాలు ప్రత్యేక శోభ సంతరించుకున్నాయి. జిల్లావాసులంతా కుటుంబ సభ్యులతో కలిసి ఆనందోత్సాహాలతో తొలి రోజు భోగి, తరువాత సంక్రాంతి, మంగళవారం కనుమ పండుగను ఘనంగా చేసుకున్నారు. ఈ సందర్భంగా పితృదేవతలు, గోవులకు సంప్రదాయబద్ధంగా పూజలు చేశారు. జీవనోపాధి కోసం వివిధ ప్రాంతాలకు వెళ్లినవారంతా సొంతూరుకు చేరుకోవడంతో గ్రామాలన్నీ పులకించాయి. బంధువుల రాకతో ప్రతి ఇంట సంతోషాలు వెల్లివిరిశాయి. చిన్నా, పెద్ద తేడా లేకుండా అంతా కొత్త దుస్తులు ధరించి ఆట పాటలతో ఉత్సాహంగా గడిపారు. గ్రామాల్లో జంగందేవరలు, గంగిరెద్దులతో దాసరులు సందడి చేశారు. సంక్రాంతి పండగ నేపథ్యంలో రంగవల్లులతో ముంగిళ్లు మెరిశాయి. మొత్తంగా మూడు రోజుల పాటు 'మన్యం' కళకళలాడింది.

మార్కెట్లు ఇలా..

కనుమ పండుగ సందర్భంగా జిల్లాలో మార్కెట్లు, ప్రధాన జంక్షన్లు నిర్మానుష్యంగా కనిపించాయి. మద్యం, మాంసం దుకాణాలు మాత్రం కిటకిటలాడాయి. సాలూరు పరిసర ప్రాంతాల్లో పొట్టేళ్లు, కోడిమాంసం, చేపలు దాదాపు రూ. 57 లక్షల మేర అమ్మకాలు జరిగినట్టు వ్యాపార వర్గాలు తెలిపాయి. మరోవైపు సాలూరు మార్కెట్‌లో మంగళవారం మాంసాహార ధరలకు రెక్కలు వచ్చాయి. బొచ్చు చేపరకం కిలో రూ. 160, బంగారు తీగె కిలో రూ.200 విక్రయించారు. మరోవైపు మద్యం విక్రయాలు కూడా జోరుగా సాగాయి. సంక్రాంతి పండగ నేపథ్యంలో సాలూరు, పాచిపెంట, మక్కువ ప్రాంతంలో రూ. 12 కోట్లు మేర వస్త్ర విక్రయాలు జరిగినట్టు వస్త్ర వ్యాపారులు తెలియజేస్తున్నారు. తొలుత అమ్మకాలు మందకొడిగా సాగినా గత వారం రోజుల నుంచి ఊపందుకున్నాయి. వస్త్రాలతో పాటు చెప్పులు, వివిధ ఫ్యాన్సీ వస్తువుల వ్యాపారం సైతం జోరుగా సాగింది.



రేగాలమ్మను దర్శించుకొనేందుకు నాగావళి నదిలో బారులుదీరిన భక్తులు

రేగాలమ్మ కండికి పోటెత్తిన భక్తులు

గరుగుబిల్లి మండలం నాగూరు సమీపంలోని నాగావళి నది మధ్యలో రాళ్ల గుట్టల నడుమ ఉన్న రేగాలమ్మ గుడికి ఏటాలానే ఈ సారి కూడా భక్తులు పోటెత్తారు. పరిసర ప్రాంతాలకు చెందిన వారు భారీగా తరలివెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దీంతో ప్రాంతం రద్దీగా మారింది. ఇక సుంకి సమీపంలోని బోటు షికారు, ఐటీడీఏ పార్కులు పర్యాటకులతో కిటకిటలాడాయి.

దొంతి కొండల వద్ద కోలాహలం

కురుపాం మండలం మొండెంఖల్ గ్రామ శివారులోని దొంతి కొండలను అధిక సంఖ్యలో ప్రజలు సందర్శించారు. ఒకదానిపై ఒకటి ఉండే రెండు పెద్ద బండరాళ్లు చూపరులను విశేషంగా ఆకర్షించాయి. పరిసర ప్రాంతవాసులు పిల్లాపాపలు, కుటుంబ సభ్యులతో కలిసి అక్కడకు చేరుకుని సందడి చేశారు. ఇదిలా ఉండగా సాలూరు మండలం మామిడిపల్లి సువర్ణముఖీ తీరానికి భారీగా గ్రామస్థులు చేరుకున్నారు. దీంతో ఆ ప్రాంతం జాతరను తల పించింది. సాయంత్రం వారంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు.





సాలూరులో కొనుగోలుదారులతో రద్దీగా మారిన చేపలు, మాంసం దుకాణాలు



కురుపాం మండలం మొండెంఖల్ దొంతి కొండల వద్ద..



అట్టలే తలుపులుగా..

ఇది సీతంపేట ఏరియా ఆసుపత్రికి ముఖద్వారం. ప్రధాన గేటుకు తలుపులను బిగించకపోవడంతో ఇలా అట్టలను పెట్టారు. సుమారు రూ.20 కోట్లతో చేపడుతున్న ఏరియా ఆసుపత్రి భవన నిర్మాణం మంద కొడిగా సాగుతోంది. ఎక్స్‌రే యూనిట్ ఎమర్జెన్సీ వార్డుకు వెళ్లే విధంగా ప్రధాన ముఖద్వారాన్ని ఏర్పాటు చేసినప్పటికీ.. నిధులు లేమితో ఆసుపత్రి పనులు ఆశించిన స్థాయిలో జరగడం లేదు. దీంతో ప్రధాన గేటుకు తలుపులను అమర్చకుండా ఇలా విడిచి పెట్టేశారు. దానిలోపల ఎక్స్‌రే యూనిట్, మందులు, ఫిజియోథెరపీ, వైద్యాధికారులు, రికార్డులు భద్ర పరిచే గదులు ఉండడంతో రాత్రి వేళల్లో ఎవరూ అందులోకి ప్రవేశించ కుండా ఇలా ముఖద్వారానికి తాత్కాలికంగా అట్టలు పెట్టారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఆసుపత్రి పనులు పూర్తవకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. దీనిపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలని కోరారు.

- సీతంపేట

పొలాల్లో ఏనుగులు

కొమరాడ: మండలంలో పంతుల్లవలస, కుమ్మరిగుంట, కందివలస గ్రామస్థులను ఏనుగులు బెంబేలెత్తిస్తున్నాయి. ఆయా ప్రాంతాల్లో అవి సోమ, మంగళవారాల్లో హల్‌చల్ చేసి.. స్థానికులను హడలెత్తించాయి. ప్రధానంగా పొలాల్లో తిష్ఠ వేసిన గజరాజులు రైతులు కోసిన వరి పంటను ఆరగించడంతో పాటు చిందరవందరగా పడేశాయి. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. చేతికందొచ్చిన పంటను ఏనుగుల గుంపు నాశనం చేయడంతో వారు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి వాటిని తరలించాలని రైతులు, ఆయా గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.



పీఎం జన్‌మాన్‌తో పీవీటీజీల అభివృద్ధి

- కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్

పార్వతీపురం, జనవరి 16 (ఆంధ్రజ్యోతి)/సీతంపేట: పీఎం జన్‌మాన్ (ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్)తో పీవీటీజీలు సుస్థిర అభివృద్ధి సాధిస్తారని కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్ తెలిపారు. సోమవారం ఆయన సీతంపేట ఐటీడీఏకు విచ్చేశారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. పీవీటీజీ గిరిజనులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధానమంత్రి మోదీ సంభాషించే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఎం జన్‌మాన్ ద్వారా ప్రతి పీవీటీజీ గిరిజన లబ్ధిదారునికి పక్కా ఇల్లు, గ్రామానికి తాగునీరు, రోడ్లు, విద్యుత్, ఉపాధి, అంగన్‌వాడీ భవనాలు తదితర సౌకర్యాలను కల్పిస్తామన్నారు. ఆయుష్మాన్‌భారత్ కార్డుల ద్వారా ఉచిత వైద్య సదుపాయం అందిస్తున్నట్లు తెలిపారు. అంతకుముందు కేంద్ర మంత్రిని ఐటీడీఏలోని ఆదివాసీ విగ్రహం నుంచి సభా ప్రాంగణం వరకు సవర ఆదివాసీలు నృత్యాలతో ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌టీఎఫ్‌డీసీ చీఫ్ మేనేజర్ బిస్మితదాస్, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల జాయింట్ కలెక్టర్లు ఎం.నవీన్, ఆర్.గోవిందరావు, పాలకొండ ఆర్డీవో ఎం.లావణ్య, ఏపీవో రోసిరెడ్డి, జీసీసీ డీఎం సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి

ఉన్నత చదువులకు వెళ్లి..

తిరిగిరాని లోకాలకు..

- అమెరికాలో పాలకొండ విద్యార్థి మృతి
- స్వగ్రామంలో విషాద ఛాయలు
- శోకసంద్రంలో తల్లిదండ్రులు

పాలకొండ: ఉన్నత చదువుల కోసమని అమెరికాకు వెళ్లిన జిల్లా విద్యార్థి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. స్వగ్రామంలో విషాద చాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. పాలకొండలోని ఎస్ఎస్ఎన్ కాలనీకి చెందిన రాకోటి వెంకట రమణ, ఆదిలక్ష్మిల కుమారుడు సాయినికేష్ (21) తాడేపల్లి గూడెంలో ఓ యూనివర్సిటీలో బీటెక్ పూర్తి చేశారు. ఎంఎస్ చదివేందుకు గాను అమెరికాలోని హార్ట్‌ఫోర్డ్ సిటీలోని సేక్రెడ్‌హార్ట్ యూని వర్సిటీలో 17 రోజుల కిందటే జాయిన్ అయ్యారు. అక్కడే ముగ్గురు తెలుగు విద్యార్థులతో కలిసి ఓ అపార్ట్‌మెంట్‌లో ఉంటూ విద్యాభ్యాసం కొనసాగిస్తున్నారు. కాగా సోమవారం రాత్రి గుంటూరుకు చెందిన విద్యార్థి సినిమాకు అని వెళ్లి సమీపంలోని మరో ఫ్రెండ్ రూమ్‌లోకి వెళ్లిపోయారు. అయితే మహబూబ్‌నగర్‌కు చెందిన విద్యార్థి, సాయి నికేష్ మాత్రం ఒకే రూమ్‌లో నిద్ర పోయారు. ఆ రూమ్‌లో ఉన్న లిక్విడ్ గ్యాస్ లీకవడంతో వారు అపస్మారక స్థితిలోకి చేరుకున్నట్లు తెలిసింది. మంగళవారం ఉదయం 10 గంటలకు గుంటూరుకు చెందిన విద్యార్థి రూమ్‌కు వచ్చి చూడగా ఇద్దరూ విగతజీవులుగా పడి ఉండడాన్ని గమనించారు. వారు నిద్రలోనే మృత్యువాత పడినట్లు గుర్తించి స్థానికులు, కళాశాల, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తరలించి అమెరికా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కాగా ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బోరున విలపించారు. ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన సాయి నికేష్ మృతి చెందడాన్ని జీర్ణించు కోలేకపోతున్నారు. మీడియా మాధ్య మాల ద్వారా ఈ విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్ సీఎంవో కార్యాలయానికి తెలియజేశారు. వారి ద్వారా అమెరికా రాయబార కార్యాలయా నికి సమాచారం అందించారు. కాగా రెండు రోజుల అనంతరం ఇండియాకు మృతదేహం వస్తుందని సాయినికేష్ మావయ్య శ్రీరాములు తెలిపారు.



సాయి నికేష్ (ఫైల్)

పార్వతీపురంలో భారీ చోరీ

- సుమారు రూ.40 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు అపహరణ
- బాధితుల ఫిర్యాదు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు

బెలగాం, జనవరి 16: జిల్లా కేంద్రం పార్వతీపురంలో ఆదివారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. సుమారు 40 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలను దొంగలు అపహరించినట్లు బాధితులు చెబుతున్నారు. అయితే ఈ ఘటనతో పట్టణవాసులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. దీనికి సంబంధించి సీఐ కృష్ణారావు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో పద్మశ్రీ థియేటర్ ఎదురుగా ఉన్న శ్రీదుర్గా నగల దుకాణాన్ని యజమానురాలు కె.శ్యామల రోజూలానే ఆదివారం ఉదయం తెరిచి.. వ్యాపార కార్యకలాపాలు నిర్వహించారు. రాత్రి షాపునకు తాళం వేసి ఇంటికి వెళ్లారు. అయితే మరుసటి రోజు సోమవారం ఉదయం ఆ రోడ్డుపై వెళ్లిన శ్యామల తనయుడు షాపును చూడగా.. షట్టర్ పైకెత్తి ఉండడాన్ని గుర్తించాడు. వెంటనే తల్లికి సమాచారం ఇచ్చాడు. హుటాహుటిన ఆమె అక్కడకు చేరుకుని షాపును పరిశీలించారు. దొంగతనం జరిగినట్లు నిర్ధారించి డయల్ 100కు ఫోన్ చేశారు. వెంటనే పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, క్లూస్ టీం అక్కడకు చేరుకున్నారు. షాపును క్షుణ్నంగా పరిశీలించి వివరాలు సేకరించారు. గతంలోనూ ఒకసారి దొంగలు చోరీకి యత్నించారని, తాజా ఘటనలో సుమారు రూ.40 లక్షల విలువ గల బంగారం, వెండి ఆభరణాలు అపహరణకు గురైనట్లు బాధితురాలు తెలిపారు. కాగా ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. అయితే ఎంత మొత్తంలో ఆభరణాలు చోరీకి గురయ్యాయో తెలుసుకుంటున్నామని, పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఆయన చెప్పారు.



షాపులో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

పండగ వేళ.. వినూత్నంగా!

- జిల్లాలో అంగన్‌వాడీల నిరసనలు
- ప్రభుత్వ తీరుపై మండిపాటు
- హామీలు నెరవేర్చాలని డిమాండ్

బెలగాం/పాలకొండ/కొమరాడ/సాలూరు రూరల్, జనవరి 16: కనుమ పండగ రోజు కూడా అంగన్‌వాడీలు ఉద్యమ బాట వీడలేదు. జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంగళవారం పార్వతీపురంలోని కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరంలో వారు వంటలు చేసుకుని నిరసన తెలిపారు. 'సీఎం జగన్‌కు.. మా ఆకలి బాధలు కనిపించడం? లేదా' అంటూ ప్రశ్నించారు. మహిళా సాధికారతకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెబుతున్న వైసీపీ సర్కారు అంగన్‌వాడీలపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. కుటుంబ సభ్యులతో జరుపుకోవాల్సిన పండగలను ప్రభుత్వ తీరు వల్ల సమ్మె శిబిరాల వద్ద చేసుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. చిరుద్యోగులమైన తమపై ఎస్మా చట్టం ప్రయోగించడం, నోటీసులు ఇవ్వడం సబబు కాదన్నారు. గత 36 రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నా.. సర్కారు స్పందించక పోవడం ఎంతవరకు సమంజసమన్నారు. కక్ష సాధింపు చర్యలను మానుకోవాలని, సీఎం జగన్ .. గతంలో తమకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వారు నినదించారు. ప్రభుత్వం దిగొచ్చే వరకు పోరాటం ఆగదని, సమ్మె మరింత ఉధృతం చేస్తామని అంగన్‌వాడీ ఉద్యోగుల సంఘం ప్రతినిధులు స్పష్టం చేశారు. సీఐటీయూ, పట్టణ పౌర సంక్షేమ, గిరిజన సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. పాలకొండ లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు ముగ్గులు వేసి.. ఎద్దులకు దండాలు పెట్టి నిరసన తెలిపారు. ప్రభుత్వం ఎలాంటి ఒత్తిళ్లు, భయాలకు గురిచేసినా వెనక్కి తగ్గేది లేదన్నారు. ప్రభుత్వం స్పందించే వరకు పోరాటం కొనసాగిస్తామని సంఘ నాయకులు వెల్లడించారు. కొమరాడలో గోమాతలకు పూజలు చేసి నిరసన వ్యక్తం చేశారు. సాలూరులో మండలానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు గుంజీలు తీస్తు ప్రభుత్వానికి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తమ డిమాండ్లు నెరవేర్చాలని ఉపముఖ్యమంత్రి రాజన్నదొరకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సమస్యలను ఈ నెల 19న విజయవాడ వెళ్లి ప్రభుత్వానికి వివరిస్తానని ఆయన తెలిపారు.



సాలూరులో గుంజీలు తీస్తూ..



కొమరాడ: గోమాతలకు పూజ చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



పాలకొండలో..



పార్వతీపురంలో..

అదితి గజపతిరాజును కలిసిన టీడీపీ నాయకులు

విజయనగరం రూరల్: సంక్రాంతి పండుగ సందర్భంగా సోమవారం విజయనగరం నియోజకవర్గ టీడీపీ నాయకులంతా నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి అదితి గజపతిరాజును కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆమెను కలిసిన వారిలో ప్రసాదుల లక్ష్మీవరప్రసాద్, ఆల్తి బంగారుబాబు, టీడీపీ మహిళా విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి అనురాధబేగం, మండల టీడీపీ నాయకులు బొద్దల నర్సింగరావు, గంటా పోలినాయుడు, రాజేష్‌వర్మ తదితరులు ఉన్నారు.

నేడు ఎస్సీ కమిషన్ చైర్మన్ రాక

విజయనగరం రూరల్: రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ బుధవారం విజయనగరం రానున్నారు. మధ్యాహ్నం 12.30 గంటలకు జడ్పీ అతిథి గృహానికి చేరుకుంటారు. అక్కడి నుంచి 2 గంటలకు విజయనగరం నుంచి శ్రీకాకుళం రోడ్డు మార్గం ద్వారా వెళ్లి, అక్కడ జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు

నేడు కబడ్డీ క్రీడాకారుల ఎంపిక

విజయనగరం దాసన్నపేట: నంద్యాల్లో ఈనెల 20 నుంచి 23 వరకూ జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ చాంపియన్ షిప్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం సిటీ క్లబ్‌లో జరుగుతుందని కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ఎ.రంగారావుదొర, కోరాడ ప్రభావతి, నడిపేన లక్ష్మణరావు, కోరాడ వేణుగోపాల్ తదితరులు ఒక ప్రకటనలో తెలిపారు. కబడ్డీ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దేవాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలి

బొబ్బిలి: అయోధ్యలో భవ్య రామమందిరం ప్రారంభోత్సవం సందర్భంగా ఈ నెల 22 వరకు దేవాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలు చేయడానికి భక్తులు ముందుకు రావాలని బీజేపీ బొబ్బిలి కన్వీనర్ మరిశర్ల రామారావు పిలుపునిచ్చారు. ఆయన బొబ్బిలిలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రతిఒక్కరు తమకు అందుబాటులో ఉన్న దేవాలయాల్లో పరిశుభ్రత కార్యక్రమాలను భక్తిపూర్వకంగా చేయాలన్నారు. 22న సాయంత్రం ప్రతి ఇంటి ముగింటలో 11 రామజ్యోతులు వెలిగి పెట్టాలని కోరారు.

వీరభద్రం త్వరలోనే కోరుకోవాలి

కొత్తవలస: తెలంగాణ రాష్ట్ర సీపీఎం కార్యదర్శి తమ్మినేని వీరభద్రం త్వరలోనే కోరుకోవాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ, జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు గాడి అప్పారావు ఆకాంక్షించారు. మంగళవారం గుండె పోటుకు గురై చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న వీరు తమ నాయకుడు అకస్మికంగా అస్వస్థతకు గురి కావడం పట్ల తీవ్ర ఆందోళన చెందారు. త్వరలోనే కోలుకోవాలని వీరు కోరారు.

షర్మిల రాకతో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

కొత్తవలస: రాష్ట్ర పీసీసీ అధ్యక్షురాలిగా వైఎస్ షర్మిలారెడ్డిని నియామకం చేయడం పట్ల రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి కె.సన్యాశి పాత్రుడు హర్షం వ్యక్తం చేశారు. వై.ఎస్ షర్మిల రాకతో రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్‌కు పూర్వ వైభవం వస్తుందన్నారు. రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో గతంలో పార్టీకి దూరమైౖ నాయకులందరూ తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. 2024 ఎన్నికలలో షర్మిల రాకతో ఓట్లశాతాన్ని గణనీయంగా పెంచుకుంటుందని, 2029 ఎన్నికలలో మాత్రం తమ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

మండలంలో గోపూజ

బొబ్బిలి: కనుమ సందర్భంగా మండలంలో కొత్తపెంట, ఎం.బూర్జవలస తదితర గ్రామాల్లో సమరసత ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం గోపూజా కార్యక్రమాలు జరిగాయి. సకల దేవీదేవతా నిలయం గోమాత అని సమరసత ఫౌండేషన్ మండల కన్వీనర్ గేదెల జనార్దనరావు అన్నారు. గోమాత పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. గొర్లె లక్ష్మణ, సిరికి ఆదినారాయణ, మరడ స్వామినాయుడు, కోలా వాసు, దూపం వాసు తదితరులు పాల్గొన్నారు.

వంగరలో టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పర్యటన

రాజాం: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఎస్సీసెల్ ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం మంగళవారం వంగరలో పర్యటించి స్థానిక టీడీపీ నేతలను కలిశారు. మాజీ ఎంపీపీ పైల వెంకటరమణ, మాజీ జడ్పీటీసీ బొత్స వాసునాయుడు, సీనియర్ న్యాయవాది, ప్రముఖ రాజకీయ సలహాదారులు బలగ వెంకటనాయుడులను కలిసి పార్టీ పరిస్థితులపై చర్చించారు. ముందుగా వీరికి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

అయోధ్యరామ అక్షింతల పంపిణీ



అక్షింతలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రాజాం: మొదగులపేట గ్రామంలో మంగళవారం అయోధ్యరామాలయం అక్షింతలను అయోధ్యరామాలయ కమిటీ సభ్యులు గ్రామంలో పంపిణీచేశారు. ఇంటింటికి తీసుకువెళ్లి కమిటీసభ్యులు గ్రామంలో పంపిణీచేసి అందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆశీర్వదించారు. ఈ పంపిణీలో స్థానిక ఆలయకమిటీ సభ్యులు, రామభక్తులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్వహణకు నిధుల్లేక

- రెండు సంవత్సరాల నుంచి మంజూరు కాక ఇబ్బందులు
- చేతి డబ్బులు పెట్టుకుంటున్న ప్రధానోపాధ్యాయులు



మదనాపురం పాఠశాల

కలెక్టరేట్: జిల్లాలోని ఓ జడ్పీ పాఠశాలలో 600 నుంచి 800 మంది విద్యార్థులు ఉన్నారు. ఆయా పాఠశాల నిర్వహణ ఖర్చులు ఏడాదికి లక్ష రూపాయలు అవుతున్నాయి.. ప్రభుత్వం గత రెండు సంవత్సరాల నుంచి నిర్వహణ నిధులు మంజూరు చేయకపోవడంతో ఆయా డబ్బులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు జేబులో నుంచి పెట్టుకుంటున్నారు. ప్రతి ఏడాది నిర్వహణ ఖర్చులు పెట్టుకోలేక ఆయా ప్రధానోపాధ్యాయులు ఆవేదన చెందుతున్నారు. ఇటువంటి పరిస్థితి అన్ని పాఠశాల్లోనూ ఉంది.

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణకు ప్రభుత్వం గత రెండు సంవత్సరాల నుంచి నిధులు మంజూరు చేయలేదు. దీంతో ఆయా నిధుల కోసం ప్రధానోపాధ్యాయులు నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఉపాధ్యాయులు తప్ప పాఠశాల నిర్వహణ కోసం అవసరమైన నిధులు మంజూరు కాకపోవడం వల్ల ప్రధానోపాధ్యాయులపై అదనపు బారం పడుతోంది.

ప్రతి పాఠశాలకు సుద్దముక్కలు, పేపర్లు, విద్యుత్ బిల్లులు, నెట్ బిల్లులు, చీపుర్లు, స్టేషనరీ తదితర ఖర్చులు ఉంటాయి. ఇవే కాకుండా పాఠశాలలో కంప్యూటర్ మరమ్మతులకు గురైతే దాని బాగు చేయడానికి ఖర్చులు కూడా పాఠశాల హెచ్ఎం పెట్టుకోవాల్సి ఉంటుంది. తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలు అయితే ఖర్చులు తక్కువగా ఉంటాయి. ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న చోట ఖర్చులు ఎక్కువగా ఉంటాయి. గతంలో ఉపాధ్యాయులకు ప్రతి నెల మొదటి తేదీన జీతాలు విడుదలయ్యేవి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రతి నెల మొదటి తేదీన జీతాలు మంజూరు కాకపోవడంతో ఉపాధ్యాయులు ఇబ్బంది పడిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇది ఇలా ఉన్న నేపథ్యంలో పాఠశాల నిర్వహణ ఖర్చులు ప్రధానోపాధ్యాయుల అదనపు భారం పడుతుంది.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని 1460 ప్రాథమిక, 316 ప్రాథమికోన్నత, 456 ఉన్నత పాఠశాలలు మొత్తం 2232 పాఠశాలలు ఉన్నాయి. 2,32,834 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి పాఠశాల నిర్వహణ ఖర్చులు మంజూరు చేయాలని ప్రధానోపాధ్యాయులు కోరుతున్నారు.

ప్రారంభమైన రహదారి భద్రత వారోత్సవాలు



ఆర్టీసీ డిపోలో రహదారి భద్రత వారోత్సవాలు

శృంగవరపుకోట, జనవరి 16: స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ రమేష్ ఆధ్వర్యంలో రహదారి భద్రత వారోత్సవాలు ప్రారంభించారు. మంగళవారం డిపో ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో డిపో మేనేజర్ మాట్లాడుతూ వచ్చే నెల 14వరకు ఈ వారోత్సవాలతు వుంటాయన్నారు. ఇందులో బాగంగా డ్రైవర్స్‌మెకానిక్‌లకు శిక్షణ,బస్సుల నిర్వహణ,డ్రైవర్లకు ప్యామీలీ కౌన్సిలింగ్, డ్రైవర్లకు సేఫ్టి ఆలవెన్సు పంపీనీ వంటివి వుంటాయన్నారు.అనంతరం డ్రైవర్లు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

మంచి సమాజానికి కృషి చేయాలి



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

బొబ్బిలి: మంచి సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఆర్సీఎం పాఠశాల పూర్వ హెచ్ఎం డాక్టర్ ఫాదర్ ప్రతాప్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఆర్సీఎం పాఠశాలలో 2002-2003 పదో తరగతి పూర్వవిద్యార్థుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ మాట్లాడుతూ క్రమశిక్షణతో బాగా చదువుకొని మంచి స్థానాల్లో స్థిరపడ్డ విద్యార్థులు సహచరులను ఆదుకోవాలన్నారు. జాగ్రత్తలు పాటించి వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో రాంబాబు, బాబురావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సత్సంగాలతో జ్ఞానం

రేగిడి, జనవరి 16: సత్సంగాలతో సత్‌ప్రవర్తన, జ్ఞానం సిద్ధిస్తుందని ప్రముఖ ఆధ్యాత్మిక వక్తలు స్వామి బాలక్రిష్ణదాస్, జడ్డు జగ్గారావు, జడ్డు అప్పలనాయుడు తదితరులు పేర్కొన్నారు. మండలంలో రేగిడి దత్తపీఠంలో స్థానిక ఆధ్యాత్మక గురువు కిమిడి సత్యన్నారాయణ అధ్యక్షతన సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా గత మూడురోజులుగా ఆధ్యాత్మక ప్రవచన కార్యాక్రమాలు నిర్వహించారు. ఆఖరిరోజు ముగింపు సమావేశంలో పలువురు వక్తలు పాల్గొని మాట్లాడారు. బోగి, సంక్రాంతి, కనుమ పండగల గొప్పతనం తెలిపి, భారత, భాగవత్, రామయణాలపై చర్చించారు. ప్రత్యేకంగా సంక్రాంతి వేడుకుల సంస్కృతి సంప్రదాయలు, అచారవ్యవహారాలపై ప్రత్యేక చర్చగోష్టి నిర్వహించి భక్తులకు చైతన్యం కల్గించారు. ఈకార్యక్రమంలో దత్తకమిటీ కన్వినర్ రుంకు శ్రీనివాసరావు మాస్టర్, మాజీ పాలకొండ జెడ్‌పిటిసి సాముంతుల దామొదర్‌రావు, రేగిడి, అమదాలవలస దత్తభక్తులు వై భాస్కరరావు, కుడుతల మురళీ, జల్లు శివ, హరీష్ తదితర్లు పాల్గొన్నారు.

'ఊరిని మర్చిపోకూడదు'

రాజాం: ఏ ప్రాంతంలో ఉన్నా, ఏదేశంలో ఉన్నా, ఎంతటి ఉద్యోగ, ఉపాధి పదవిలో ఉన్నా జన్మనిచ్చిన ఊరుని, కన్నతల్లిదండ్రులను, సంస్కృతి సంప్రదాయలను మర్చిపోకూడదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడెమీ మాజీ చైర్మన్ అదపాక సత్యారావు తెలిపారు. రాజాం నియోజకవర్గం పరిధి సంతకవిటి మండలం సత్యారావు స్వగ్రామం సిరపురంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు-24 ముగింపు సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న క్రీడలు, రంగవల్లులు, క్విజ్‌లు, తదితర పోటీల్లో విజేతలకు, గత ఏడాది కాలంలో వృత్తి, విద్యాకోర్సుల్లో ప్రతిభాపాటవాలతో సీట్లు పొందినవారికి, రాష్ట్ర జాతీయస్థాయిలో వివిధ క్రీడల్లో పతకాలు సాధించిన వారికి, ప్రభుత్వ ఉద్యోగాలు సాధించినవారికి, స్థానిక సర్పంచ్ డోల తిరుపతిరావు, మాజీ సర్పంచ్ మంగరాజు కామినాయడు, గ్రామ ప్రతినిధి మొయ్యి నారాయణప్పడుతో కలిసి బహుమతలు, అవార్డులు అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాలకు ఎంత చేసినా, గ్రామాన్ని కలిసి కట్టుగా తలోచెయ్యివేసి అభివృద్ధి చేసుకుంటూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటుతో పాటు, శ్మానసవాటికి నిర్మాణానికి సాయం ప్రకటించారు.

ఆకట్టుకున్న ఎడ్ల పరుగుపోటీలు



పరుగుపోటీలో దౌడుతీస్తున్న ఎడ్లబండి



కోలాటం ఆడుతున్న బాలికలు

వేపాడ, జనవరి 16: మండలంలోని గుడివాడ గ్రామ సమీపంలోని కొండగుళ్ల బ్రహ్మలింగేశ్వరస్వామి తీర్థం, కృష్ణరాయుడుపేట గ్రామంలో కృష్ణరాయుడుస్వామివారి తీర్థం, బానాదిలో శివాలయ తీర్థం మంగళవారం వైభవోపేతంగా జరిగాయి. కేఆర్‌పేట గ్రామంలో కృష్ణరాయుడుస్వామి తీర్థమ హోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహకులు ఏర్పాటు చేసిన ఎడ్ల పరుగు పోటీలు ఆసక్తిగా సాగాయి. 13 ఎడ్ల బండ్లు పాల్గొనగా మొదటి స్థానాన్ని వల్లంపూడికి చెందిన ఎడ్లబండి దక్కించుకోగా వీరికి నిర్వహకులు మొదటి బహుమతిగా రూ. 12 వేలు రూపాయలు అందించారు. వరుసగా 5 వస్థానం వరకు బహుమతులను గ్రామ పెద్దల చేతుల మీదుగా అందించారు. నిర్వహించారు. తీర్థమహోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అడ్డువానిపాలెం, కండివరం గ్రామాల ట్రూపుల బాలికల కోళాటం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. పోటీలను తిలకించేందుకు వేలాదిగా ప్రజలు తరలి వచ్చారు.

పేదలకు దుస్తుల పంపిణీ

రేగిడి: మండలంలో చిన్నశిర్లాం, లింగాలవలస గ్రామాల్లో మజ్జి శ్రీనివాసరావు, అడపా చిరంజీవి నిరుపేదలకు బాసటగా నిలిచారు. మండల తెలుగు యువత అధ్యక్షుడు చిన్నశిర్లాంకు చెందిన మజ్జి శ్రీనివాసరావు గ్రామంలో వృద్ధులు, వితంతువులు, దివ్యంగాలు, నిరుపేదలు సుమారు వందమందికి చీరల, దుప్పట్లు పంపిణీ చేయగా, లింగాలవలస గ్రామంలో గ్రామానికి చెందిన అడపా చిరంజీవి వారి తల్లి సీతమ్మ జ్ఞాపకార్థం లింగావలస, తోకలవలస, వావిలవలసకు చెందిన దాదాపు 400 మందికి వస్త్రదానం చేసి తన సేవా నిరితిని చాటుకొన్నారు. చిరంజీవి గత పదేళ్లుగా వస్త్రదానం చేస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. వేర్వేరుగా జరిగిన కార్యాక్రమాల్లో చిన్నశిర్లాం, లింగాలవలస గ్రామపెద్దలు పాల్గొన్నారు.

విజయనగరం దాసన్నపేట: జిల్లాలో కనకల శ్రీనివాసరావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తామని ట్రస్టు చైర్మన్ కనకల రఘురామారావు అన్నారు. సంక్రాంతి, కనుమ సందర్భంగా పేదలకు నిత్యావసర సరుకులు, చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏటా ట్రస్టు ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు, పేదలకు నిత్యావసర సరుకులు, విభిన్న ప్రతిభావంతులకు ట్రై సైకిళ్ల పంపిణీ చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు విస్తృతం చేస్తామన్నారు. ట్రస్టు సభ్యులు గిరి, సతీష్, పుష్పకుమార్ రెడ్డి, విజయ్‌కుమార్, కొండలరావు, పైడిరాజు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



వస్త్రదానం చేస్తున్న గ్రంథి మల్లిఖార్జునరావు

వందలాది మందికి జీఎంఆర్ వస్త్రదానం

రాజాం రూరల్: ప్రముఖ పారిశ్రామికవేత్త గ్రంధి మల్లిఖార్జునరావు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం తన కుటుంబ సభ్యులతో కలిసి భారీస్థాయిలో అన్న, వస్త్రదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇక్కడి జీఎంఆర్ ఐటీ గ్రౌండ్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సుమారు ఏడువేల మంది పేదలతో పాటు సాధువులకు వస్త్రాలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ సతీమణి వరలక్ష్మి, సోదరులు పెదబాబు, చినబాబు, ఈశ్వర్రావు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. రెండు దశాబ్దాలుగా ఏటా సంక్రాంతి పర్వదినాన భారీస్థాయిలో కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది.

ఆంద్ర జలాశయంలో వ్యక్తి మృతి

మెంటాడ, జనవరి 16: ఆంద్ర జలాశయంలో ప్రమాదవశాత్తు పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జయతి గ్రామానికి చెందిన అప్పలనాయుడు(59) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం ఇంటి నుంచి బయటకు వెళ్లిన అప్పలనాయుడు ఎంతకీ తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అన్నిచోట్లా వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. ఈ క్రమంలో ఆంద్ర జలాశయంలో సోమవారం సాయంత్రం మృతదేహం తేలుతూ కనపడడంతో స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరకున్న పోలీసులు మృతుడి దుస్తులు, చెప్పులు వంటి ఆనవాళ్లను బట్టి అప్పలనాయుడిగా గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అందించారు. భార్య అప్పలనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆంద్ర పోలీసులు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే ఈ మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

వైన్ షాప్ తొలగించాలని ఫిర్యాదు

రామభద్రపురం: మండలం పరిధిలో మిర్తివలస గ్రామానికి వెళ్లే దారిలో ప్రభుత్వ మద్యం షాపు ఏర్పాటు చేయడంతో మహిళలు, విద్యార్థినులు ఇబ్బందులకు గురవుతున్నారని సర్పంచి మజ్జి రాంబాబు, గ్రామస్థులు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ అప్పారావుకు మంగళవారం ఫిర్యాదు చేశారు. మద్యం షాపు ఎత్తేసి, ఆకతాయిలపై చర్యలు తీసుకోవావాలని కోరారు. ప్రతి రోజూ సాయంత్రం కొట్టక్కి జిల్లా పరిషత్ స్కూల్ విద్యార్థులు మందు బాబుల వల్ల ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం సంక్రాంతి పండగకు వచ్చి విశాఖపట్నం వెళ్తున్న మందుబాబులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచారని తెలిపారు.

నెక్కలను కలిసిన రఘురాజు



నెక్కలనాయుడుబాబు దంపతులను సత్కరిస్తున్న రఘురాజు దంపతులు

కొత్తవలస, జనవరి 16: శంగవరకోట టిక్కెట్ విషయంలో కడుబండికి చెక్ పెట్టడానికి మరోసారి కొత్తవలసలో కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబును ఎమ్మెల్సీ రఘురాజు సోమవారం మధ్యాహ్నం ఆయ న స్వగృ హంలో కలిశారు. కడుబండి శ్రీనివాసరావును మొదటి నుంచి స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు వ్యతిరేకిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. గత నెల 31 వతేదీన కొత్తవలసలో ఆత్మీయ సమావేశం పేరుతో ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు దంపతులకు కొత్తవలసలో నెక్కలనాయుబాబు దంపతులతో పాటు ఐదు మండలాలకు చెందిన వారు సన్మానం చేశారు. ఈ సారి ఎమ్మెల్సీ దంపతులు కొత్తవలసలోని నెక్కలనాయుడుబాబు ఇంటికి వచ్చి సంక్రాంతి, నెక్కల నాయుడుబాబు జన్మదినం పేరుతో ఘనంగా సన్మానం చేశారు. తరువాత నెక్కల, ఇందుకూరు కలసి కొద్ది సేపు ఏకాంతంగా మాట్లాడుకు న్నారు. ● అంతకుముందు ఆదివారం నెక్కల నాయుడు బాబు వద్దకు ఎమ్మెల్యే కడుబండి శ్రీనువాసరావు వచ్చి కలిశారు. ముఖ్యమంత్రిని కలవడానికి తనతోపాటు నెక్కలను ఆహ్వానించారు. అందుకు నెక్కల పార్టీ మెజార్టీ నాయకుల కార్యకర్తల అభిప్రాయం మేరకే వ్యవహరిస్తానని తెలిపారు.

ఐశ్వర్య లక్ష్మీనరసింహునికి ప్రత్యేక పూజలు

జామి, జనవరి 16: మండలంలోని కుమరాం కల్యాణ్‌నగర్‌లో వున్న శ్రీఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కనుమపండుగ సందర్భంగా స్వామి వారికి పూజలుచేశారు. ఆలయ చైర్మన్ జీఎస్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రసాదాచార్యులు పూజలుచేశారు.

కుమరాం ఐశ్వర్యలక్ష్మి నరసింహస్వామికి పూజలు



అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు ఎప్పుడో?

- ఇబ్బందులు ఎదుర్కొంటున్న భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలవాసులు



భోగాపురంలో అగ్ని ప్రమాదం జరిగిన దృశ్యం(ఫైల్)

భోగాపురం: భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాల్లో అగ్ని ప్రమాదం సంభవిస్తే అంతే సంగతి. ఈ మండలాల్లో అగ్ని ప్రమాదం జరిగితే జిల్లా కేంద్రం నుంచి, శ్రీకాకుళం జిల్లా రణస్థలం, విశాఖ జిల్లా నుంచి అగ్నిమాపక శకటాలు వస్తాయి. ఇలోపే ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగిపోతాయి. భోగాపురం మండలంలో అగ్ని ప్రమాదం చోటుచేసుకుంటే సుమారు 2 గంటల తర్వాతే అగ్నిమాపక శకటాలు వస్తున్నాయి. ఒక్కోసారి 3గంటల సమయం కూడా పడుతుంది. దీంతో భారీగా ఆస్తినష్టం సంభవిస్తోంది. దీంతో బాధిత కుటుంబాలు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు కట్టుబట్టలతో మిగులుతున్నాయి. భోగాపురం మండలంలో గత నాలుగేళ్లగా సుమారు 37 అగ్ని ప్రమాదాలు సంభవించాయి.

ప్రతిపాదనలతోనే సరి..

గతంలో భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ మండలాలతో పాటు తీర ప్రాంత గ్రామాలకు అందుబాటులో ఉండే విధంగా డెంకాడ మండలం నాతవలస సమీపంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు జరిగాయి. అయితే మళ్లీ ఆ ప్రతిపాదనలు కనుమరుగయ్యాయి. ఇప్పటికైనా ప్రజా ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరగకుండా ఉండేవిధంగా మూడు మండలాలకు అందుబాటులో ఉండే విధంగా అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నాడు ఇలా చెత్తసంపద కేంద్రం



నేడు తొలగించిన ప్రదేశం ఇలా

నాడు ఆదర్శం- నేడు అగమ్యగోచరం

వంగర: అరసాడలో గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన చెత్త సంపద కేంద్రం ఆదర్శంగా నిలిచింది. ఇటీవల కొందరు నాయకులు టీడీపీ నిర్మించిందనే ఉద్దేశంతో దానిని తొలగించడానికి ప్రణాళికలు తయారు చేశారు. ఆ స్థానంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించాలని సిద్ధమయ్యారు. ఆ భవనాన్ని తొలగించడం అంత సులువు కాదని.. ఉన్నతాధికారుల అనుమతులు ఉండాలని మండల నాయకులు చెప్పినా ఆ నాయకులు వినలేదు. ఆ తరువాత కాంట్రాక్టరుతో సంప్రదించిన నాయకుడు పనులు ప్రారంభించాలని చెప్పాడు. ఇక్కడే సమస్య ప్రారంభమైంది. ప్రభుత్వ భవనం మంజూరుకు సంబంధిత గ్రామ పంచాయితీతో పాటు మరికొందరు అభ్యంతర పత్రం (ఎలినేషన్) ఇవ్వాలి. ఆ తరువాత ప్రభుత్వం పరిశీలించి... భవన మంజూరుకు అనుమతులు ఇస్తుంది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నాయకులు గ్రామ సమీపంలో ఎలినేషన్ ఇచ్చింది. అక్కడ నిర్మాణాలు చేపట్టకూడదనే ఉద్దేశంతో ఆ నాయకుడు చెత్త సంపద కేంద్రాన్ని తొలగించేందుకు ప్లాన్ చేశాడు. ఈ విషయం తెలుసుకున్న కాంట్రాక్టర్ నిర్మాణానికి ముందుకు రాలేదు. దీంతో ఉన్నది పోయింది... కొత్తది రాకుంది అన్న చందంగా మారింది. చెత్త సంపద కేంద్రం తొలగింపుపై పంచాయతీ అధికారి త్రినాథ వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా... దీన్ని తొలగించే అధికారం తమకు గానీ... నాయకులకు గానీ లేదన్నారు. తొలగించినట్లయితే సంబంధిత అధికారులకు నోటీసులు ఇచ్చి వివరణ కోరుతామన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు.

బరి తెగిస్తున్న రియల్ మాఫియా

శృంగవరపుకోట రూరల్: మండలంలో రియల్ మాఫియా బరి తెగిస్తోంది. వీరు ఎక్కడ పడితే అక్కడ భూములు కొనుగోలు చేసి... ప్లాట్‌గా విభజించి అమ్మకాలు చేస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా లేఅవుట్‌లు వేసి రూ.లక్షలు సంపాదిస్తున్నారు. వీరికి దిగువ స్థాయి సిబ్బంది సహకారం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కిల్తంపాలెం పంచాయతీ కాపుసోంపురం ఆంజనేయ స్వామి ఆలయం వెనుక భాగంలో కొద్దిరోజుల క్రితం రియల్ మాఫియా రెండెకరాలు కొనుగోలు చేసింది. ఎటువంటి అనుమతులు లేకుండా అక్కడి చెట్లను యథేచ్ఛగా నరికించింది. లేఅవుట్‌లోకి వెళ్లేందుకు దారి లేకపోయినా పంట కాలువపై కానాలు, రహదారి నిర్మించింది. అనంతరం లేఅవుట్ రూపొందించి అమ్మకాలు చేస్తోంది. ఈ విషయమై వీఆర్‌వో కృష్ణను వివరణ కోరగా.. స్థలాన్ని పరిశీలించామని... యజమానులను పిలిపించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.



అనుమతులు లేకుండా నరికివేయించిన చెట్లు



అనుమతులు లేకుండా పంట కాలువపై రోడ్డు వేసేందుకు ఉన్న సిమ్మెంట్ పైపులు

అంబరాన సంక్రాంతి సంబరం

సంక్రాంతి సంబరం అంబరాన తాకింది. హరిదాసుల కీర్తనలు, వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు.. నూతన వస్త్రాల్లో పిల్లలు, పెద్దలు.. బంధుమిత్రులతో కళకళలాడిన గ్రామాలు.. సంక్రాంతి, కనుమ పండగలను జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. స్నేహితులు, బంధువులతో ఉత్సాహంగా గడిపారు. పెద్దలకు పూజలు చేశారు. కనుమ రోజున మంగళవారం గోమాతలకు పూజలు చేశారు. పలు గ్రామాల్లో వివిధ క్రీడా పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. (ఆంధ్రజ్యోతి బృందం)

● బంధుమిత్రులతో కళకళలాడిన గ్రామాలు ● క్రీడా పోటీల నిర్వహణ ● సందడి చేసిన హరిదాసులు, గంగిరెద్దులు ● గోవులకు ప్రత్యేక పూజలు


నెల్లిమర్ల: రామతీర్థంలో గోపూజ


చీపురుపల్లి: శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద గోపూజ


రేగిడి: కె.వెంకటాపురంలో బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు


కొత్తవలస: బలిఘట్టాంలో హరిదాసుల సందడి

కొత్తవలస: మండలంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. సోమవారం సంక్రాంతి, మంగళవారం కనుమ పండగ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు తమ కుటుంబాలతో ఉత్సాహంగా గడిపారు. ● **శృంగవరపుకోట రూరల్:** గవరపాలెంలో యువత, పెద్దలు కలిసి కనుమపండును ఉత్సాహంగా చేసుకున్నారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు గ్రామంలో వున్న రామాలయంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తి కార్యక్రమాలు నిర్వహించారు. ● **నెల్లిమర్ల:** సంస్కృతి, సంప్రదాయాలతో కలగలిసిన పండుగ సంక్రాంతి అని టీడీపీ మండల అధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ అన్నారు. వల్లూరు గ్రామంలో యువకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని, పలు పోటీల విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ● **మెరకముడిదాం:** సంక్రాంతి సంబరాల్లో భాగంగా పతివాడపేట గ్రామంలో మంగళవారం ఆటలు పోటీలు నిర్వహించారు. ఏసీటీవో టి.శంకరరా వు తన సొంత నిధులతో బహుమతులు ప్రదానం చేశారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు

వేపాడ: సింగరాయి గ్రామంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని మంగళవారం నిర్వహించిన ముగ్గులు పోటీలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. గ్రామ పెద్దల సారథ్యంలో నిర్వహించే ఈ ముగ్గుల పోటీల్లో సుమారు 40 మంది మహిళలు పాల్గొని ముగ్గులు వేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ● వావిలపాడు గ్రామంలో టీడీపీ నాయకులు గుంటపల్లి దేముడునాయుడు, పెంటపల్లి బుజ్జి, జనసేన పార్టీ కార్యకర్తలు వారాది ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలు అలరించాయి. ఈ ముగ్గుల పోటీల్లో సుమారు 60 మంది మహిళలు పాల్గొని వివిధ రకాల ముగ్గులు వేశారు. విజేతలైన ముగ్గురు మహిళలకు గ్రామ పెద్దలు చేతులు మీదుగా బహుమతులు అందజేశారు. మ్యూజికల్ ఛైర్ పోటీలు నిర్వహించి బహుమతులందజేశారు.

కె.వెంకటాపురంలో బోనాల పండగ

రేగిడి: మండలంలో సంక్రాంతి వేడుకలు అంబరాన్ని తాకాయి. ఇళ్ల ముందు రంగవల్లి, గొబ్బెమ్మలతో అలంకరణలు, వంటకాలతో బోనాల అలంకరణలు, కుటింబీకులంతా పేరంటాలకు బోనాలు ఇవ్వటం, ఇతర సాంస్కృతి కార్యక్రమాలు ఎంతగానో అలరించాయి. వెంకటాపురంలో బోనాల పండగ, సంకిలిలో ముగ్గులు పోటీలు, చిన్నారుల డ్యాన్‌లు ఎంతగానో అలరించాయి.

కనుమ సంబరాల్లో మంత్రి

మెరకముడిదాం: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ సోమలింగాపురం గ్రామంలో డీసీఎంఎస్ మాజీ అధ్యక్షుడు ఎస్వీ రమణరాజు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కనుమ పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. మొదటిగా గోపూజ నిర్వహించారు. అనంతరం అందరినీ ఆప్యాయంగా పలకరించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. జడ్పీటీసీ మాజీ అధ్యక్షుడు కోట్ల విశ్వేశ్వరరావు, వేణుగోపాలరావు, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఉరేగింపు

చీపురుపల్లి: పట్టణంలో సంక్రాంతి సంబరాలు సోమవారం ఘనంగా జరిగాయి. జి.అగ్రహారానికి చెందిన రెడ్డి ఇంటి పేరు ఉన్న సుమారు 50 కుటుంబాలు ఎప్పటిలాగే ఒకే చోట సంక్రాంతి పండగను నిర్వహించారు. తమ ఇలవేల్పయిన లక్ష్మీనరసింహస్వామిని ముందుగా పట్టణంలోని పెద్ద చెరువు వరకూ ఊరేగించారు. అనంతరం సాయంత్రం అంతా కలిసి ఒకే చోట చేరి స్వామి ప్రసాదాన్ని స్వీకరించారు. ఊరేగింపు సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఆలయాల వద్ద గో పూజలు

చీపురుపల్లి: చీపురుపల్లి శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం గోపూజ నిర్వహించారు. కనుమ పండగ సందర్భంగా ఆలయ ఈవో జి.శ్రీనివాస్, కమిటీ ఛైర్మన్ ఇప్పిలి సూర్యప్రకాష్, వైస్ ఛైర్మన్ సూరు వెంకటకుమార్, అర్చకులు ఆరవెల్లి రవి తదితరులు గోవులను పూజించారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కంది శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. ● **నెల్లిమర్ల:** రామతీర్థం దేవస్థానంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని మన సంస్కృతి-మన పండుగ నినాదంతో మంగళవారం ఉత్తర రాజగోపురం వద్ద గో పూజ నిర్వహించారు. పలు గోవులకు నుదుట కుంకుమ దిద్ది, పూజలు చేశారు. ఈ కార్యక్రమాన్ని దేవస్థానం ఈవో బీహెచ్‌వీఎస్ఎన్ కిషోర్‌కుమార్ పర్యవేక్షించగా, అర్చకులు నిర్వహించారు.

స్వగ్రామంలో రాజన్నదొర పూజలు

సాలూరు రూరల్: సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్నదొర స్వగ్రామం మక్కువ మండలం మర్రివానివలసలో సంక్రాంతి పూజలను సోమవారం నిర్వహించారు. అనంతరం తమ పొలాలను సందర్శించారు. బాల్యమిత్రులతో నాటి జ్ఞాపకాలను పంచుకున్నారు.

ముగిసిన 'మేలుకొలుపు'

గరుగుబిల్లి: రావుపల్లి గ్రామంలో ధనుర్మాసం సందర్భంగా నెల రోజుల పాటు నిర్వహించిన మేలుకొలుపు కార్యక్రమం సంక్రాంతి పండగతో ముగిసింది. శ్రీఉమారామలింగేశ్వరస్వామి భజన మండలి ఆధ్వర్యంలో సోమవారం మేలుకొలుపు కార్యక్రమం నిర్వహించారు. భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో మకరజ్యోతి పూజలు

సాలూరు రూరల్: మకర సంక్రాంతి సందర్భంగా సోమవారం రాత్రి స్థానిక అయ్యప్ప ఆలయంలో మకరజ్యోతి పూజలు చేశారు. మకరజ్యోతికి ప్రతీకగా కర్పూర దీపం వెలిగించి భక్తులు భజనలు చేశారు. బాణసంచా కాల్చారు. ఆలయ ఛైర్మన్ హరిస్వామి, పైడి నాయుడు, రాపాక నాగసాయి పాల్గొన్నారు.


చీపురుపల్లి: లక్ష్మీనరసింహస్వామిని ఊరేగిస్తున్న దృశ్యం


కొమరాడ: జంఝావతి రబ్బరుడ్యాం వద్ద సరదాగా గడుపుతున్న యువత


గరుగుబిల్లి: కీర్తనలు పాడుతున్న భజన మండలి సభ్యులు


సాలూరు రూరల్: మకరజ్యోతికి పూజలు చేస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురి మృతి

దత్తిరాజేరు: కోమటిపల్లి కూడలి వద్ద ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. మంగళవారం సాయంత్రం 7గంటల ప్రాంతంలో జరిగిన ఈ ప్రమాదంలో నలితం నరసకుమారి(43), భర్త సత్యనారాయణ(50), ఈయన సోదరుని కుమారుడు నలితం మహేష్(27) మృతి చెందారు. ఇద్దరు ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోగా సత్యనారాయణను ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు ఇన్‌చార్జి ఎస్ఐ మహేష్‌కుమార్ తెలిపారు. విశాఖలోని ఎండాడ ప్రాంతంలో ఈ కుటుంబం నివాసం ఉంటోంది. సంక్రాంతి పండగ కోసం సొంత ప్రాంతమైన పార్వతీపురంలోని బెలగాం వెళ్లారు. మంగళవారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. విశాఖ వెళుతుండగా దత్తిరాజేరు మండలం కోమటిపల్లి కూడలి వద్దకు వచ్చేసరికి వీరు ప్రయాణిస్తున్న కారు ముందు నడుస్తున్న లారీని ఓవర్ టేక్ చేసే ప్రయత్నంలో విశాఖ నుంచి పార్వతీపురం వస్తున్న వ్యాన్ ఢీ కొట్టింది. ఘటనా స్థలంలో ఇద్దరు, ఆస్పత్రికి తరలిస్తుండగా సత్యనారాయణ ప్రాణాలు కోల్పోయారు.

టీడీపీలోకి 50 కుటుంబాలు


పార్టీలోకి ఆహ్వానిస్తున్న జయకృష్ణ

పాలకొండ (వీరఘట్టం): వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక టీడీపీలోకి భారీగా చేరుతున్నారని పాలకొండ నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి నిమ్మక జయకృష్ణ అన్నారు. వీరఘట్టం మండలం అడారు గ్రామంలో వైసీపీకి చెందిన 50 కుటుంబాలు మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. చోడి నారాయణరావు, చోడి గాంధీ, చోడి సింహాచలం, చోడిఎల్లయ్య, కోష్టి సింహాచలం, జమ్మల గౌరి, జమ్మల ఈశ్వరరావు తదితరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి జయకృష్ణ పార్టీ కండువాలను వేసి, సాదరంగా ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుందని జయకృష్ణ ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, ఉదయాన ఉదయ్‌భాస్కర్, మాచర్ల అనీల్, పెరపు వెంకటరమణ, బలిజి సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అచ్చెన్నను కలిసిన మాజీ ఎమ్మెల్సీ జగదీష్


అచ్చెన్నాయుడుకు శుభాకాంక్షలు తెలుపుతున్న జగదీష్

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడును మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ మంగళవారం కలిశారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ గ్రామంలో అచ్చెన్నాయుడును కలిసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. అచ్చెన్నాయుడును కలిసిన వారిలో పార్టీ నియోజకవర్గ పరిశీలకులు గోవింద రాజులు, పార్టీ నాయకులు దొగ్గ మోహన్, జాగాన రవిశంకర్, జి.రవికుమార్ తదితరులు ఉన్నారు.

ముగిసిన క్రికెట్ పోటీలు


విజేత జట్టుకు ట్రోఫీలను అందిస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: రావివలసలో ఫ్రెండ్స్ యూత్ నిర్వహించిన క్రికెట్ పోటీలు మంగళవారంలో ముగిశాయి. ఈ పోటీల్లో 32 టీంలు పాల్గొనగా ప్రథమ బహుమతిని వీరఘట్టం టీం, ద్వితీయ బహుమతిని రావివలస టీం దక్కించుకున్నాయి. విజేతలకు నగదు బహుమతులతో పాటు ట్రోఫీలను అందించారు. రావివలస ఎంపీటీసీ సభ్యుడు కోట భరత్‌కుమార్, టీడీపీ నాయకులు జి.వెంకటనాయుడు, భానుమూర్తి, శ్రీనివా సరావు, జి.కిశోర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పీపీఎల్ విజేత బాయ్స్‌రైడర్స్


ఆనందోత్సాహంతో విజేత జట్టు

జియ్యమ్మవలస: పెదబుడ్డిడి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన పెదబుడ్డిడి ప్రీమియర్ లీగ్ (పీపీఎల్)లో బాయ్స్ రైడర్స్ జట్టు విజేతగా నిలిచింది. మంగళవారం ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. విజేత జట్టుకు రౌతు వాసుదేవరావు ట్రోఫీతో పాటు రూ.6,500, రన్నరప్‌కు రూ.3,500, మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌గా నిలిచిన గుమ్మడి వైకుంఠకు కర్రి శివాజీ మూడు తులాల వెండి అందించారు. టోర్నీకి అంపైర్‌గా వ్యవహరించిన రేవళ్ల రామకృష్ణను నిర్వాహకులు అభినందించారు.

పండగ పూట నిరసన

● 36వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె

అంగన్‌వాడీలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పార్వతీపురం మన్యం జిల్లా వ్యాప్తంగా చేపట్టిన సమ్మె మంగళవారంతో 36వ రోజుకు చేరుకుంది. పండగ పూట కూడా సమ్మెలో పాల్గొని, నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోగా, కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని అన్నారు. హామీలను నెరవేర్చాలని వారు కోరారు. (ఆంధ్రజ్యోతి బృందం)


సీతానగరం: నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు


సీతంపేట: మద్దతు తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు



గరుగుబిల్లి: సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు

ఏకాగ్రతతో బస్సులు నడపాలి

పాలకొండ: ఆర్టీసీ డ్రైవర్లు ఏకాగ్రతతో బస్సులు నడపాలని పాలకొండ ఆర్టీసీ డిపో మేనేజర్ పి.వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం ఆయన స్థానిక డిపోలో రోడ్డు భద్రతా వారోత్సవాలు ప్రారంభించారు. మలుపుల వద్ద, స్కూల్ జోన్ల వద్ద అతిజాగ్రత్తతో బస్సులు నడపాలన్నారు. అనంతరం డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ జోనల్ సెక్రటరీ భాసూరు కృష్ణమూర్తి, సెక్యూరిటీ హెడ్ గార్డు బి.రాంబాబు, ఎల్‌హెచ్ వి.రమణమూర్తి, స్టోర్ ఏడీసీ రాజు, సిబ్బంది గురవయ్య, తిరుపతిరావు, సంగమేశం, బంగారునాయుడు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.



పాలకొండ: వారోత్సవాల్లో మాట్లాడుతున్న డీఎం వెంకటేశ్వరరావు

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

సాలూరు రూరల్: ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నిబంధనలను విధిగా పాటించాలని సాలూరు పట్టణ సీఐ జి.దేవుడుబాబు పిలుపునిచ్చారు. సాలూరు ఆర్టీసీ డిపోలో మంగళవారం డిపో మేనేజర్ భాస్కరరావు ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా మహోత్సవాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. రోడ్డు ప్రమాదాలు నివారణకు నిబంధనలు పాటించడమే ప్రథమ కర్తవ్యమన్నారు. రోడ్డు భద్రత నిబంధనలు పాటిస్తే అత్యధిక రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చునన్నారు. వాహన చోదకులు డ్రైవింగ్‌లో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డ్రైవర్లు పాల్గొన్నారు.

నాగూరు సర్పంచ్‌కు సన్మానం

గరుగుబిల్లి: 'పంచాయతీసే పార్లమెంట్ తక్' కార్యక్రమంలో భాగంగా ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ మహిళా కమిషన్ సదస్సులో ప్రసంగించిన నాగూరు సర్పంచ్ కేతిరెడ్డి శిరీషను మంగళవారం ఆ గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని చెప్పారు.

రాముడి అక్షింతల పంపిణీ

గరుగుబిల్లి: అయోధ్య రామాలయ అక్షింతల పంపిణీ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల భక్తులు నిమగ్నమయ్యారు. మంగళవారం పలు గ్రామాల్లోని రామ మందిరాల వద్ద అక్షింతలను ప్యాకింగ్ చేశారు.


అక్షింతలను ప్యాకింగ్ చేస్తున్న దృశ్యం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కురుపాం రూరల్: వారంతా కురుపాంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో 1984 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్నారు. ప్రస్తుతం వివిధ వృత్తుల్లో స్థిరపడ్డారు. సంక్రాంతి సందర్భంగా స్వగ్రామం కురుపాంకు చేరుకున్నారు. మంగళవారం సాయంత్రం వారంతా వారిలో ఒకరైన బరాటం ప్రకాష్ ఇంట్లో సమావేశమయ్యారు. చిన్నప్పటి విషయాలు ముచ్చటించుకున్నారు. తాము చదువుకున్న పాఠశాలకు, కురుపాం అభివృద్ధికి ఏమేమి చేయగలమో చర్చించుకున్నారు. సమావేశమైన వారిలో అయ్యారక కార్పొరేషన్, కళింగవైశ్య కార్పొరేషన్ డైరక్టర్లు గవర విజయ్ చంద్రశేఖర్, కొత్తకోట సురేష్‌కుమార్, వైసీపీ నాయకుడు శెట్టి నాగేశ్వరరావు, న్యాయవాదులు బరాటం చంద్రమౌళి, కోలా జ్యోతి తదితరులు ఉన్నారు.


కురుపాంలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



నేడు కొటారుబిల్లి కనకదుర్గమ్మ తీర్థం

గంట్యాడ: కొటారుబిల్లి కనకదుర్గమ్మ తీర్థ మహోత్సవం బుధవారం మధ్యాహ్నం నిర్వహించనున్నారు. ఈ మహోత్సవానికి నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభం కానున్న తీర్థ మహోత్సవం రాత్రి 8 గంటలకు ఉంటుంది. వేలాది మంది భక్తులు రానున్నారు. గంట్యాడ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

'జ్ఞాపకాల పొరల్లోంచి' పుస్తక ఆవిష్కరణ

కొమరాడ: మన్యం జిల్లాలో ప్రముఖ కథా రచయిత గంటేడ గౌరునాయుడు రచించిన జ్ఞాపకాల పొరల్లోంచి (ఫేస్ బుక్ సీరియల్) పుస్తకాన్ని తన స్వగ్రామం దళాయిపేటలో సోమవారం ఆవిష్కరించారు. తాను రచించిన ఈ మూడో పుస్తకం.. తల్లి సోములమ్మ 90 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.


పుస్తక ఆవిష్కరణలో సోములమ్మను సన్మానిస్తున్న దృశ్యం

20న ఐటీడీఏ ఎదుట నిరసన

గుమ్మలక్ష్మీపురం: ఈనెల 20న పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్నామని గిరిజన సంక్షేమ సంఘం, గిరిజన నిరుద్యోగ సంక్షేమ సంఘం నాయకులు పాలక రంజిత్‌కుమార్, తాడంగి సాయిబాబు, ఆరిక ప్రభాకరరావు తెలిపారు. ఈమేరకు మంగళవారం వారు స్థానిక విలేకర్లతో మాట్లాడారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు, గిరిజన కళాశాల వసతిగృహాలకు ఏఎన్ఎంలను నియమించాలనే డిమాండ్‌తో నిరసన చేపడుతున్నామని చెప్పారు.

పనుకువలసలో ఆధ్యాత్మిక జ్ఞానబోధ

పాలకొండ: పనుకువలస గ్రామంలో ఆధ్యాత్మిక జ్ఞానబోధ సభ మంగళవారం నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ సామంతుల దామోదరరావు పుట్టినరోజు కావడంతో గ్రామంలోని నిరుపేదలకువ వస్త్రాలు పంపిణీ చేశారు. అలాగే పనుకువలస గ్రామంలోని గీతా భక్తులు, సత్యసాయిభక్తులు సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. పాలకొండ సత్యసాయి ప్రతినిధి ఎన్వీ రమణకు దేవాలయాల అర్చకులకు సన్మానాలు చేశారు. ఎన్వీ రమణ ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు.

ప్రమాదమని తెలిసినా..

● రైల్వేగేటు మూసిఉన్నా.. కింది నుంచి రాకపోకలు సాగిస్తున్న ప్రయాణికులు

గజపతినగరం: స్థానిక మెంటాడ రైల్వేగేటు వద్ద వాహనదారులు ప్రమాదకర రీతిలో రాకపోకలు సాగిస్తున్నారు. సాధారణంగా రైలు వచ్చే సమయంలో అధికారులు గేటు వేస్తుంటారు. ఆ సమయంలో వాహనదారులు ఆగిపోవాలి. రైలు వెళ్లిన తర్వాత రాకపోకలు సాగించాలి. అయితే పలువురు వాహనదారులు రైలు వచ్చే సమయంలో గేటు పడినా గేటు కింద నుంచి వాహనాలను తీసుకువెళ్లే విధంగా సాహసం చేస్తున్నారు. ప్రమాదమని తెలిసినప్పటికీ వాహనదారులు ఈవిధంగా ప్రయాణం సాగించడం శోచనీయమని రైల్వే అధికారులు అంటున్నారు. ఇప్పటికైనా రైల్వే గేటు పడినప్పుడు వేచి ఉండాలని సురక్షిత ప్రయాణం సాగించాలని సంబంధిత అధికారులు కోరుతున్నారు.



రైల్వేగేటు కింద నుంచి వాహనాలను తీసుకువస్తున్న దృశ్యం

